క్లుప్తంగా

గెస్ట్ లెక్చరర్ల నియామకానికి దరఖాస్తులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన అతిథి అధ్యాపకులను నియమించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్‌మిల్టన్ ఓ ప్రకటనలో తెలిపారు. వాణిజ్యశాస్త్రం ముగ్గురు, ఎకనామిక్స్, తెలుగు, ఇంగ్లిష్, కంప్యూటర్ సైన్స్ బోధనకు ఇద్దరు చొప్పున, సెరికల్చర్, పొలిటికల్ సైన్స్ బోధనకు ఒక్కో అధ్యాపకుడిని నియమిస్తామని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఎస్సీ, ఎస్టీలైతే 50శాతం, ఇతరులు 55 శాతం మార్కులు కలిగి ఉండాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హత, బోధనానుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. అభ్యర్థులు ఈనెల 5వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవడంతో 6వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

ముమ్మరంగా ప్లాంటేషన్‌ల ఏర్పాటు


మొక్క నాటుతున్న ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు

చంద్రుగొండ: డివిజన్ పరిధిలోని అటవీప్రాంతాల్లో ఖాళీగా ఉన్న భూముల్లో వివిధ రకాల మారుజాతి మొక్కలతో ప్లాంటేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు తెలిపారు. చంద్రుగొండ రేంజ్ పరిధిలోని పోకలగూడెం బీట్‌లో చేపట్టిన ప్లాంటేషన్ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. దివంగత రేంజర్ చలమల శ్రీనివాసరావు స్మృతివనాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీఓ మాట్లాడుతూ.. పోడు పేరిట అడవులను నాశనం చేస్తే చట్టరీత్యా నేరమన్నారు. అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన వెంట రేంజర్ ఎల్లయ్య, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు సంత వేలంపాట

బూర్గంపాడు: మోరంపల్లిబంజర సంత వేలంపాటను ఈ నెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు గ్రామపంచాయతీ కార్యదర్శి భవాని తెలిపారు. మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పెసా చట్టం ప్రకారం సంత వేలంపాటలో ఎస్టీలు మాత్రమే పాల్గొనాలని తెలిపారు. వేలంపాటలో పాల్గొనదలిచిన వారు రూ.లక్ష డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

చంద్రుగొండ: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యయత్నానికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు యువజన విభాగం మండల అధ్యక్షుడు బడుగు గణేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కులవివక్ష కారణంగానే ఎస్ఐపై శాఖ అధికారులు, కొంతమంది సిబ్బంది వేధింపులకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. బేతి నాగబాబు, బడుగు నాగేశ్వరరావు, పానేం నరేందర్, తలారి పవన్, అరవింద్, కల్యాణ్ పాల్గొన్నారు.

సుదర్శన హోమం

బూర్గంపాడు: సారపాకలోని లక్ష్మీ గణపతి ఆలయంలో మంగళవారం సుదర్శన హోమం వైభవంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం చేసిన ఈ హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సుదర్శన హోమం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు వితరణ చేశారు.

పోస్టర్లు విడుదల

బూర్గంపాడు: తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య ఆశయసాధన ఉద్యమించాలని పిలుపునిచ్చారు. జూలై 4న ఖమ్మంలో జరగనున్న దొడ్డి కొమరయ్య 78వ వర్ధంతి సభను, ప్రదర్శనను విజయవంతం చేయాలని మంగళవారం చింతల లక్ష్మీనగర్‌లో ప్రచార పోస్టర్లను సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఎస్‌డీఎల్‌సీ నాయకురాలు సున్నం భూలక్ష్మి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొమరయ్య భూపోరాటాన్ని వివరించారు. నాయిని కొమరయ్య, కోడెం రాధా, పర్శిక వెంకటరమణ, చంద్రకళ, నాగలక్ష్మి, వెంకటమ్మ పాల్గొన్నారు.

స్థలం కేటాయింపుపై హర్షం

మణుగూరురూరల్: ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఆదివాసీ డోలీ కళాకారుడు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య కుటుంబానికి ప్రభుత్వం ఇంటిస్థలం కేటాయించడం, దశదిన కర్మలకు రూ.2లక్షల ఆర్థిక సాయం అందించడంపై కూనవరం ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇంటి స్థలం, రూ.కోటి సాయాన్ని ప్రకటించినా ఇవ్వలేదని, ఆయన కుటుంబానికి ప్రస్తుత ప్రభుత్వం అండగా నిలవడంపై ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.

ధరణి సమస్యలు పరిష్కరించండి

- గ్రామాల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలి
- అధికారుల సమీక్షలో ఎమ్మెల్యేలు





అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ

మణుగూరుటౌన్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తూనే రైతులకు సంబంధించి ధరణి, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదేశించారు. మణుగూరులో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమై మాట్లాడారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి నీరు, చెత్త నిల్వకుండా చర్యలు తీసుకోవాలని తద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలని సూచించారు. మండలాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన బాధితులకు ఇందిరమ్మ ఇళ్లలో ప్రాముఖ్యత ఇవ్వాలని చెప్పారు. ధరణి దరఖాస్తుల పరిష్కారం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర పథకాలపై పర్యవేక్షించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, తహసీల్దార్ వి.రాఘవరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు, ఎస్సై మేడ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా, సమితిసింగారంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రైల్వేగేట్ వరకు సైడ్ డ్రెయిన్ నిర్మాణంతో పాటు రేగులగండి చెరువు నీటిని మద్దులగూడెం, సీతానగరం ప్రజలకు సాగునీటిగా అందించడమే కాక మణుగూరు మున్సిపాలిటీని గ్రామపంచాయతీగా మార్చాలని సీపీఐ నాయకులు దుర్గ్యాల సుధాకర్, మున్నా లక్ష్మీకుమారి తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మణుగూరురూరల్: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా భావించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచించారు. సమితిసింగారం గ్రామ పంచాయతీలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. హెచ్‌ఎం జి.నాగశ్రీ, ఉపాధ్యాయులు బి.కిషన్, కె.రవికుమార్, కె.పరమయ్య, బి.శ్రీనివాసరావు, కె.నాగేశ్వరరావు, సీహెచ్.సరిత, ఏ.శేఖర్, వి.కృష్ణమూర్తి, బి.నరేష్, పి.కోటేశ్వరరావు, సింగరేణి రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు యు.శివరామకృష్ణ, కె.గురుమూర్తి, జి.నాగేశ్వరరావు, ఐ.గోపి, కె.నాగేశ్వరరావు, జి.మధుబాబు పాల్గొన్నారు.

దమ్మపేట: గ్రామాల సుభిక్షమే ధ్యేయంగా పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వ అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే జారే, అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో అధికారులు చేసిన పనికంటే తన హయాంలో ఎక్కువ పనిచేయాలని కోరారు. ప్రజల కోసం కష్టపడి పనిచేసే అధికారులను అభినందిస్తానని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన అధికారులపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రధానంగా పారిశుద్ధ్యం, ఆరోగ్యం, తాగునీరు వంటి అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆరోగ్యం పట్ల గ్రామాల్లో చైతన్యం కలిగిస్తూ, తగిన వైద్యం అందజేయాలని, ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బందికి సూచించారు. పోడు భూముల సమస్యల పరిష్కారంలో ఫారెస్టు అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలని సూచించారు. ఆయిల్ పామ్ తోటల్లో చెట్లకు తగులుతున్న ఎల్‌టీ, 11 కేవీ విద్యుత్ లైన్ల మార్పిడికి రైతులకు సహకరించాలని అన్నారు. పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనలో ఎల్లప్పుడూ ముందు ఉంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పలు శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ


పనులను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఈఈ తానాజీ

ములకలపల్లి: ములకలపల్లి శివారు పాములేరు వాగు వద్ద కోతకుగురైన డైవర్షన్ రోడ్డు పనులు ఎట్టకేలకు పూర్తయ్యాయి. దీంతో మూడు రోజులుగా నిలిచిన రాకపోకలు మంగళవారం రాత్రి నుండి మళ్లీ ఆరంభమయ్యాయి. ములకలపల్లి-తాళ్లపాయ గ్రామాల మధ్య పాములేరువాగుపై నూతన వంతెన నిర్మాణ పనులు చేపడుతుండగా.. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన డైవర్షన్ రోడ్డు వర్షాలకు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. పలు గ్రామాలకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో.. ఐటీడీఏ అధికారులు హుటాహుటిని డైవర్షన్ రోడ్డు పునరుద్ధరణ పనులు చేపట్టారు. నూతనంగా మోరీలు వేసి, మట్టి, గ్రావెల్ నింపి, రోడ్డును నిర్మించారు. దీనితోపాటు 13 లక్షల వ్యయంతో ఇనుప వంతెనను సైతం నిర్మిస్తున్నారు. ఐటీడీఏ ఈఈ తానాజీ, ఏఈ సుబ్బరాజుతో కలసి పాములేరు వాగు ప్రాంతాన్ని సందర్శించి, పునరుద్ధరణ పనులను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన డైవర్షన్ పనులు చేపడుతున్నామని, ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని తెలిపారు. తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ భారతి, ఎస్సై రాజమౌళి డైవర్షన్ రోడ్డు పనులను పరిశీలించారు.

అగ్నిమాపక అధికారిగా వినోద్ కుమార్



పినపాక: మణుగూరు, పినపాక మండలాల నూతన అగ్నిమాపక అధికారిగా పి.వినోద్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రెండు ఫైర్ స్టేషన్ల పరిధిలోని మండలాల్లో ఇండస్ట్రియల్, మినీ ఇండస్ట్రియల్, ప్రైవేటు కాలేజీ, పాఠశాల యాజమాన్యంలు అగ్నిమాపక ప్రమాణాలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు సంభవిస్తే 101కి కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శంకర్



ములకలపల్లి: భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ములకలపల్లి మండల అధ్యక్షుడిగా పూసుగూడెంకు చెందిన గుగులోతు శంకర్ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. బీజేపీ అభివృద్ధికి శక్తివంచనలేకుండా కృషి చేస్తానని అన్నారు. అధిష్టానానికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మడివి రవి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి పోలిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముసలయ్య, లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు మాళోతు గాంధీ పాల్గొన్నారు.

మునగ సాగుతో అధిక లాభాలు

అన్నపురెడ్డిపల్లి: మునగ సాగుతో అధిక లాభాలు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారిణి (ఎంఏఓ) అనూష సూచించారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మునగ సాగు కోసం సన్న, చిన్నకారు రైతులకు ఉపాధి హామీ పథకంలో పెంపకం ఖర్చులు అందజేయబడతాయని తెలిపారు. మునగ సాగుపై ఆసక్తిగల రైతుల దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టాపాస్ పుస్తకం, ఉపాధి హామీ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లను జతచేసిన దరఖాస్తులను ఈజీఎస్ ఏపీఓ, ఏఈఓ, జీపీ కార్యదర్శికి అందించాలని తెలిపారు.

అనీమియాపై వ్యాధిపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రాజశేఖర్ రెడ్డి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సికిల్ సెల్ అనీమియా(రక్తహీనత) వ్యాధిపై ఏరియా ఆస్పత్రి ఆర్‌ఎంఓ, ప్రముఖ పిల్లల వైద్యుడు రాజశేఖర్ రెడ్డి మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన హిమోగ్లోబిన్ శాతం పెంచుకునేందుకు తీసుకోవాల్సి జాగ్రత్తలతో పాటు ఎటువంటి సందర్భాల్లో అనీమియా వ్యాధి వస్తుంది, దాని బారిన పడకుండా ఉండేందుకు ఎటువంటి చర్యలు చేపట్టాలనే విషయాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు ప్రతి రోజూ మంచి ఆహారం తీసుకోవడం వల్ల ఎనీమియా వ్యాధి భారిన పడకుండా ఉండవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రమ, రత్నకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల రహదారులపై దృష్టి పెట్టాలి

బూర్గంపాడు: మారుమూల గ్రామాల రహదారుల దుస్థితిపై అధికార యంత్రాంగం దృష్టి పెట్టాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని గోపాలపురం, ఉప్పుసాక, నకిరిపేట గ్రామాలకు వెళ్లే రహదారులను మంగళవారం సీపీఎం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మారుమూల గిరిజన గ్రామాల రహదారుల అభివృద్ధిపై ఐటీడీఏ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో గుంటక కృష్ణ, మంగీలాల్, మహేందర్, లక్ష్మణ్, తాటి రాము తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ


దుమ్ముగూడెం: సభలో మాట్లాడుతున్న ఏడీఏ సుధాకర్‌రావు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని రైతు వేదికలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా త్వరలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే రైతు భరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న రైతులు రైతు భరోసా పథకం అమలుకు సంబంధించి పలు సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ శ్రీనివాసరావు, కె.సత్యనారాయణ, ఎమ్.సత్యనారాయణ, శృతి, అనిల్ కుమార్, సుధాకర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: రైతుభరోసా పథకంపై రైతుల నుంచి స్వీకరించిన సూచనలు, సలహాలను ప్రభుత్వానికి నివేదిస్తామని ఏడీఏ సుధాకర్‌రావు అన్నారు. మంగళవారం సొసైటీ అధ్యక్షుడు కిలిమి ఎల్లారెడ్డి అధ్యక్షతన సొసైటీ కార్యాలయం వద్ద ప్రత్యేక మహాజన సభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న రైతులు తమ సలహాలను సూచనలు అందించారు. పది ఎకరాల లోపు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలని, కౌలు రైతులకు జరుగుతున్న నష్టం జరుగుతోందని అభిప్రాయాలు వ్యక్తమైనట్లు ఏడీఏ తెలిపారు. సభలో సొసైటీ డైరెక్టర్లు యలమంచి శ్రీనివాసరావు, బొల్లి సూర్యచంద్రరావు, ఆకుల లక్ష్మీపతి రావు, కాలవ పూర్ణయ్య, పిసోడి వెంకటేష్, పాయం చలపతి, బొల్లి చిన వెంకట్రావు, కొమరం భద్రమ్మ, ఉబ్బా భద్రయ్య, అన్నెం శ్రీనివాసరెడ్డి, మానిటరింగ్ ఆఫీసర్ సుజాత,సంఘం కార్యదర్శి హిమబిందు, సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి వడ్డాణం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం గ్రామంలోని ముత్యాలమ్మ అమ్మవారికి తాళ్లపూడి నాగేశ్వరరావు-లక్ష్మి దంపతులు, వారి కుమార్తె, అల్లుడు గొల్ల గీత-శ్రీకాంత్ వారి పిల్లలు తనీష్, కృతిక కుటుంబ సమేతంగా అమ్మవారికి వడ్డాణం మంగళవారం బహుకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం దాతలు ఇచ్చిన వడ్డాణానికి పూజలను నిర్వహించి అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని షిరిడి సాయి బాబా మందిరంలో నిర్వహించే నిత్యాన్నదానానికి మంగళవారం ఓ భక్తుడు రూ.1,00,116లు విరాళంగా అందజేశాడు. దుమ్ముగూడెం మండలంలోని ఎస్ఎల్ఎస్ విద్యుత్ కర్మకారంలో ఉద్యోగి కొణికి వెంకట మురళీమోహన్-పరమేశ్వరి దంపతులు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ కమిటీ వారు దాతలను శాలువాతో సత్కరించి బాబా వారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తి, కోశాధికారి కుంచాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ఏఎంసీ కాలనీకి చెందిన ట్రాలీ డ్రైవర్ సాయి కిరణ్ ఓ ప్రమాదంలో తీవ్ర గాయాలై ఇంట్లో ఉండడంతో కుటుంబ పోషణ కష్టంగా మారి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న కానిస్టేబుల్ ప్రసాద్ మంగళవారం బాధితున్ని పరామర్శించి రూ.6 వేలు ఆర్థిక సహాయంతో పాటు 25 కిలోల బియ్యంను కుటుంబ సభ్యులకు అందజేశాడు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న అడిషనల్ పీడీ

గుండాల: ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకు ప్రభుత్వం చేపడుతున్న సామాజిక తనిఖీ అధికారుల, ప్రజల సమక్షంలో నిర్వహించాల్సిన ప్రజా వేదిక ప్రజలు లేక వెలవెలబోతోంది. ఇక్కడ జరిగే ప్రజా వేదిక జిల్లా అధికారులకు నివేదిక మాత్రం ఎలా వెళ్తుందోనని స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం డీఆర్డీఏ అడిషనల్ పీడీ రవి ఆధ్వర్యంలో 15వ విడత సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో మండలంలోని 11 పంచాయతీల్లో రూ.1కోటి 42 లక్షల పనులు, పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో రూ.1కోటి 58 లక్షల పనులు జరిగాయి. దీనికి సంబంధించి సామాజిక తనిఖీ బృందాలు గత వారం రోజులుగా ఆయా పంచాయతీల్లో జరిగిన పనులపై తనిఖీ నిర్వహించారు. మస్టర్లు వేసి కూలి నగదు దుర్వినియోగం చేశారని, రికార్డులు నిర్వహించకుండా పనులు చేశారని తేల్చారు. పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని బృందాలు పేర్కొన్నాయి. గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిం చకుండా ఇష్టానుసారం పనులు జరిగినట్లు తేల్చారు. సంతకాల ఫోర్జరీతో మస్టర్లు రాసినట్లు తెలిపారు. మన ఊరు మన బడి సంబంధిత ఈజీఎస్ పనుల రికార్డులు పరిశీలించకుండానే ఆడిట్ అధికారులు అలసత్వం చూపారని సంబంధిత ఏఈ ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు ప్రజావేదికలో అక్రమాలపై తీసుకున్న చర్యలు తెలుపకుండానే సభను ముగించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రమణ, ఏపీవో అనుష, జేక్యూసీవో అనిల్, ఏపీఓ రవితేజ, ఉ పాధి హామీ సిబ్బంది. పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ కూలీలు పాల్గొన్నారు.

'డీలక్స్' ప్రయాణంతో బహుమతులు

మణుగూరురూరల్: మహిళలు ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి బహుమతులు గెలుచుకోవచ్చని టీఎస్ ఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్ టి.స్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మణుగూరు డిపో నుంచి హైదరాబాద్ రూట్‌లలో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు.. దిగేటప్పుడు తమ టిక్కెట్ వెనుకభాగంలో తమ అడ్రస్, ఫోన్ నంబర్ రాసి బస్సులో ప్రత్యేకంగా ఏర్పాటు చేసి బాక్సులో వేయాలన్నారు. 15 రోజులకు ఒకసారి బాక్సులను తెరిచి లక్కీడ్రా తీయనున్నట్లు తెలిపారు. గెలుపొందిన మహిళా విజేతలకు బహుమతులను అందజేయడం జరుగుతుందన్నారు. మహిళా ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని డీలక్స్ బస్సుల ప్రయాణం ద్వారా లక్కీడ్రాలో బహుమతులు గెలుపొందాలని ఆయన ప్రకటనలో సూచించారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ


విద్యార్థులకు జామెట్రీ బాక్సులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ మహిళా సభ్యులు నిర్వహించే కిట్టి పార్టీ ఆధ్వర్యంలో సేకరించిన నగదు ద్వారా సీతారామ్‌నగర్ కాలనీ, జగదీష్ కాలనీలలో ఉన్న ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు పుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లు, బిస్కెట్ ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు రాజా శ్రీనివాస్, ఉపాధ్యాయులు, కెమిస్ట్ మహిళా సభ్యులు పాల్గొన్నారు.

అటవీ రేంజ్ కార్యాలయం ఎదుట ధర్నా

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలోని ఫారెస్ట్ రేంజ్ కార్యాలయం ఎదుట మద్దుకూరుకు చెందిన పోడుదారులు మంగళవారం ధర్నా చేశారు. తాము కొన్నేళ్ల క్రితం నుంచి పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములను ఏడాదిక్రితం ప్లాంటేషన్ పేరిట అటవీ అధికారులు లాక్కున్నారని పోడుదారులు తెలిపారు. అయితే ఈ ఏడాది ఇతరులు ఆ భూములు స్వాధీనం చేసుకుని వ్యవసాయం చేపట్టారని, అయినప్పటికీ అటవీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. లోపాయికారి ఒప్పందాలతోనే మా భూములను లాక్కుని ఇతరులకు కట్టబెట్టారని ఆందోళనకారులు ఆరోపించారు. తమకు సత్వరమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ భూమిని రక్షించాలి

చర్ల: మండలంలోని కన్యాకా పరమేశ్వరి దేవి ఆలయ ప్రభుత్వ భూములను ప్రభుత్వం తక్షణమే రక్షించే బాధ్యతలు తీసుకోవాలని మాస్‌లైన్ డివిజన్ నాయకుడు కొండా చరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చరణ్ మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా కన్యకా పరమేశ్వరి దేవి ఆలయ ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురయ్యాయని, ఆక్రమణదారులకు అధికారులు ఇప్పటివరకు ఒక్క నోటీస్ కూడా ఇవ్వలేదని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొండ కౌశిక్, నాయకులు చెన్నం మోహన్, మెహమదా, పున్నారావు, నాగరాజు, సోమరాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దుమ్ముగూడెం: భద్రాచలం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అన్నె సత్యనారాయణ మూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. నడికుడి గ్రామంలోని వీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నేడు జరిగే నియోజకవర్గ స్థాయి విస్తృతస్థాయి సమావేశానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంఎల్‌సీ తాతా మధు హాజరువుతారని అన్నారు. దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, వెంకటాపురం, వాజేడు మండలాల నాయకులు, ప్రజా ప్రతినిధులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి కణితి రాముడు, నాయకులు జానిపాష, కొత్తూరు సీతారామరావు, నోముల రామిరెడ్డి, దామెర్ల శ్రీనివాసరావు, వెంకట్, రేగుబల్లి మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా


ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ రంగంలో స్వామినాథన్ సిఫార్సులు చేసి, ధ్యాన్యానికి మద్దతు ధర నిర్ణయించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అశ్వారావుపేటలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య మాట్లాడుతూ.. ప్రతి ఏటా సాగు ఖర్చు పెరుగుతున్నా.. దీనికి అనుగుణంగా పంటల ధరలు పెరగకపోవడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందని అన్నారు. తక్షణమే రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించాలని, స్వామినాథన్ సిఫార్సులను అమలు చేయాలని చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తగరం జగన్నాథం, గడ్డం సత్యనారాయణ, గడ్డం వెంకటేశ్వరరావు, కలపాల భద్రం, సీసం రాముడు పాల్గొన్నారు.

ఆశ కార్యకర్తలు సర్వే చేపట్టాలి


అన్నపురెడ్డిపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రియాంక

అశ్వారావుపేటరూరల్: క్షేత్ర స్థాయిలో ఆశ కార్యకర్తలు జ్వర సర్వేను చేపట్టాలని, ఒకొక్క కార్యకర్త 50 గృహాలను సందర్శించి వివరాలు నమోదు చేసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రాందాస్ నాయక్ అన్నారు. మంగళవారం వినాయకపురం పీహెచ్‌సీ వద్ద ఆశ కార్యకర్తలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. సర్వే సమయంలో జ్వర పీడితులను గురిస్తే తక్షణమే రక్త నమూనాలను సేకరించాలని సూచించారు. ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే నిర్వహించాలని, పంచాయతీకి దోమల నివారణకు 200 ఆయిల్ బాల్స్ ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సీహెచ్‌వో జయశ్రీ, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి, విజయలక్ష్మి, ఏఎస్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చర్లరూరల్: సత్యనారాయణపురం పీహెచ్‌సీలో మంగళవారం ఆశా డే సందర్భంగా ఆశా కార్యకర్తలతో వైద్యాధికారిని దివ్యనయన ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష సమావేశ నిర్వహించారు.గ్రామాలలో దోమలు పెరగకుండా చూడాలని,అందరూ దోమతెరలు కట్టుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ ఇంటిలో దోమల మందు పిచికారీ చేసే విధంగా చూడాలని, జ్వర పీడితుల రక్త పరీక్షలు తీసి వెంటనే ఆసుపత్రికి పంపాలన్నారు. సమావేశంలో డీపీయంఓ సత్యనారాయణ, పీహెచ్ఎన్ఓ పద్మావతి, హెచ్ఈఓ బాబూరావు,హెల్త్ సూపర్‌వైజర్ కనకదుర్గ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నపురెడ్డిపల్లి: ప్రతీ ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈ అంశంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎర్రగుంట ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి ప్రియంక అన్నారు. మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన 'ఆశాడే'లో ఆమె మాట్లాడారు. సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చూడాలన్నారు. ఆశావర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.